ఆశలన్నీ కందిపైనే

- ఇటీవల కురిసిన వర్షానికి దిగుబడి పెరిగే అవకాశం
- వేరుశనగ సాగు చేసి నష్టపోయిన రైతులకు ఊరట



పూత దశలో ఉన్న కంది పంట

మడకశిర రూరల్: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో సాగు చేసిన పంటలకు జీవం వచ్చింది. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది కళకళలాడుతోంది. ఈ ఏడాది నియోజకవర్గంలో 6,680 ఎకరాల్లో కంది సాగు చేశారు. అప్పులు చేసి మరీ వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావంతో ఈ సారి నియోజకవర్గంలో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. ప్రత్యామ్నాయ పంటగా కంది సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఇందులో కొంత మంది రైతులు వేరుశనగ సాగుకు స్వస్తి పలికి.. పూర్తిస్థాయిలో కంది సాగుచేశారు. మరికొంత మంది రైతులు వేరుశనగ పంటలో అంతర పంటగా కంది సాగు చేశారు. యాజమాన్య పద్ధతులు అవలంభిస్తూ పంటల సాగులో జాగ్రత్తలు తీసుకున్నారు. ఇలాంటి సమయంలో గత నాలుగైదు రోజులుగా ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలు వేరుశనగకు ఉపయోగం లేకపోయినా కంది పంటకు మాత్రం లాభంగా మారింది. పూతదశలో వర్షాలు పడటంతో దిగుబడి పెరిగే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇక 20 రోజుల వరకు వర్షాలు రాకపోయినా కంది పంటకు ఢోకా ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కంది పంట ఆశాజనకంగా ఉండటంతో ఊరట చెందుతున్నారు. కొంత నష్టాన్నైనా పూడ్చుకోవడానికి అవకాశం ఏర్పడిందని చెబుతున్నారు.

రెండు ఎకరాల్లో సాగు చేశా..



ఎకరాకు రూ.20 వేలు ఖర్చు పెట్టి రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. పంట పూత దశలో ఉన్న సమయంలో తెగుళ్లు వ్యాపించాయి. అధికారుల సూచన మేరకు మందు పిచికారీ చేశాను. వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట ఆశాజనకంగా ఉంది. కంది దిగుబడి పెరిగితే చేసిన అప్పులు తీరిపోతాయి.

– శాంతప్ప, రైతు ఆమిదాలగొంది, మడకశిర మండలం

ఆశాజనకంగా ఉంది



ఇటీవల వర్షాలు పడడంతో సాగు చేసిన కంది పంట బాగానే ఉంది. వేరుశనగ సాగు చేసి నష్టపోయిన రైతులకు కొంత వరకు కంది పంట ద్వారా ఊరట లభిస్తోంది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పూత బాగా వచ్చింది. ఈ సారి పూర్తిస్థాయిలో కంది పంట రైతులకు అందే అవకాశం ఉంటుంది. తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– కృష్ణమీనన్, ఏడీఏ మడకశిర వ్యవసాయశాఖ డివిజన్

క్లుప్తంగా

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

హిందూపురం: కులవివక్షకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం, సమానత్వం కోసం నిరంతరం పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెడ్పీ శ్రీనివాసులు అన్నారు. కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో అన్నమయ్య అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జస్టిస్ పున్నాగ కమిషన్ సూచనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణ, కేవీపీఎస్ రాయుడు యోగానంద్, రామాంజనేయులు, చౌడప్ప,నాజియా, ఆర్షియా, సరస్వతి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి



కంప్యూటర్ సహాయకుల సేవలు పరిశీలిస్తున్న ఏఈఎస్ శ్రీరామ్

హిందూపురం అర్బన్: మద్యం దుకాణాలకు ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ సూచించారు. శనివారం హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. కంప్యూటర్ డిజిటల్ సహాయకులు, బ్యాంకర్లతో సమావేశమై దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. హిందూపురం పరిధిలో 9 , పరిగికి సంబంధించి రెండు షాపులకు ఇక్కడే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శనివారం పరిగి దుకాణాలకు సంబంధించి నాలుగు దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐ పృథ్వీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



డీఎస్సీ అభ్యర్థులతో మంత్రి సవిత

పెనుకొండ: ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు ఎస్. సవిత పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో బీసీ సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన రోజే మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యర్థులు పోటీ పరీక్షల్లో సత్తా చూపాలన్న ఉద్దేశంతో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి పెనుకొండలో బీసీస్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అగళి: మండల పరిధిలోని ఆర్‌జీ పల్లి పంచాయతీలో గత ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు గ్రామస్థాయిలో సేవలందిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆర్‌జీ పల్లి పంచాయతీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

అమరాపురం: మండలంలోని హేమావతి బస్టాండు సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు శనివారం భూమి పూజ చేశారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఉన్న చోట మరుగుదొడ్లు, వాష్ రూములను నిర్మించడానికి భూమిపూజ చేశామన్నారు. అలాగే దేవాలయానికి వచ్చే భక్తులకు ఇవి ఎంతగానో ఉపయోగ పడుతాయని తెలిపారు.

రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

పెనుకొండ: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

పరిగి: ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని అదనపు జిల్లా జడ్జీ కంపల్లె శైలజ సూచించారు. పరిగిలో శనివారం వెలుగు కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే శైలజ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. పీపీ ఇందాద్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సీనియర్ న్యాయవాది కళావతి మహిళా చట్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హసీనా సుల్తానా, సీఐ రాఘవన్, ఏపీఎం రామేశ్వరరెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: ముస్లిం మహిళలు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వక్తలు సూచించారు. జామియా ఈద్గా ఫంక్షన్ హాల్‌లో టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ అధ్యక్షతన శనివారం ముస్లిం మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ రమణమ్మ మాట్లాడుతూ మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ చైతన్య వంతులు చేయాలన్నారు. న్యాయవాది నవేరా రహ్మాన్ మహిళా చట్టాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ ఖదీజా షేక్ మహిళా ఆరోగ్యం, హక్కుల గురించి వివరించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ ఘని, ముఫ్తీ ఇబ్రహీం.అతావుల్లా, ఇస్మాయిల్, మరఘూబ్, కౌన్సిలర్లు షాజియా, మాజాన్, షేక్ రేష్మా, నాసిరా బాను మాట్లాడారు. అనంతరం అందమైన చేతిరాతతో అరబిక్ కాలీగ్రఫీ ప్రదర్శించిన రుఖియాకు ఉత్తమ కాలీగ్రఫీ పురస్కారం, దివ్య ఖురాన్‌ను అలాగే అస్మా తబస్సుమ్, హాఫీజా ఉమ్మె ఐమాన్ దివ్య ఖురాన్ కంఠస్థం పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీబీ హాజీరాఖాన్, నేమతున్నిసా, నఫీసా, నాజిమా, ఫరీదాతోపాటు పట్టణ ప్రముఖులు ముస్తఫా, రియాజ్, ఉబెదుల్లా హుసేన్, సాదిక్, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్య వసతులపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రజుమంలో జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, ఏఓ వీరనరేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో భారీ వర్షం



వర్షపు నీటితో నిండిన నీటి కుంట

లేపాక్షి: లేపాక్షి మండలంలో గురు, శుక్రవారాల్లో కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు, చెక్‌డ్యామ్‌లు నిండి పొంగి పొర్లాయి. మండలంలోని కొండూరు, కల్లూరు, కంచిసముద్రం, శిరివరం తదితర గ్రామాల్లోని కుంటలు, చెరువులకు వర్షపు నీరు చేరుతోంది. మండల వ్యాప్తంగా శుక్రవారం 68 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

మడకశిరలో 54.4 ఎంఎం వర్షపాతం


మడకశిరరూరల్: నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి జోరు వర్షం కురిసింది. మడకశిర మండలంలో 54.4 ఎంఎం, అగళి 38.4 ఎంఎం, రొళ్ల 29.4 ఎంఎం, గుడిబండ 82 ఎంఎం, అమరాపురం 32.4 వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా నుంచి వర్షం పడుతుండటంతో రైతులు తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే తడిసి కుళ్లిపోతోంది. పశుగ్రాసం కూడా లభించదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జగన్మాతా నమో నమామి


సాక్షి బృందం: జగన్మాతా నమోనమామి అంటూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.




రొళ్ల మండలం రత్నగిరిలో చంద్రఘంట అలంకరణ




పెనుకొండ మండలం చంద్రగిరిలో అన్నపూర్ణేశ్వరిగా మహేశ్వరి




పెనుకొండలో అన్నపూర్ణేశ్వరిగా వాసవీమాత




ఉగ్రనరసింహుడిగా పేట వెంకటరమణస్వామి



హిందూపురం: కమలాంబికా దేవిగా వాసవీమాత



లేపాక్షి: అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి



పావగడ: కరగ అలంకారంలో కాళికాదేవి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



హిందూపురం కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు, సిబ్బంది



మడకశిర కోర్టు ఆవరణలో చెత్త తొలగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్



పెనుకొండలో కోర్టు ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

హిందూపురం అర్బన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం సీనియర్ సివిల్ జడ్జిమానిపాటి శ్రీధర్‌తో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయ స్థానం భవనాల పైకప్పుల్లో చెత్తా చెదారాన్ని తొలగించాలని పర్యవేక్షకులకు సూచించారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం మానాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, సిద్దు, గోపాల కృష్ణ, రమేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో 'స్వచ్ఛతా హీ సేవా'

మడకశిర: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ కూడా స్వచ్ఛతను కాపాడి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అదే విధంగా జాతీయ ఉచిత సేవలను పొందడానికి 15100 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

పెనుకొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ పేర్కొన్నారు. శనివారం న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు స్వచ్ఛతాహి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభతపై దృష్టి ఉంచాలన్నారు. న్యాయమూర్తులు బొజ్జప్ప, ముజిబ్ పసలల్లా సయ్యద్, న్యాయవాదులు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, ఏజీపీ భాస్కరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగార్జున, శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్, విశ్వనాథ్‌నాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కల్లు వ్యాపారిపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: న్యాయవాది రవికుమార్‌ను బెదిరించిన కల్లు వ్యాపారి రామకృష్ణప్పపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈత కల్లు పేరుతో రసాయన పదార్థాలు కలిపి విక్రయిస్తూ నిరుపేద కుటుంబాల ప్రాణాలను బలి తీసుకుంటున్న కల్లు వ్యాపారి రామకృష్ణప్పపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్‌ఎఫ్ రవికుమార్ మాట్లాడుతూ కల్లు వ్యాపారి రామకృష్ణప్పతో నాకు, నా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, పద్మావతి, కిష్టప్ప, అనిల్ పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయండి

అమరాపురం: మండలంలో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏసీ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ.. ప్రస్తుతం నూతన హేమ మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. హేమ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా సుజాత ఎన్నికై నట్లు తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కొత్త కార్యవర్గం కృషి చేయాలన్నారు. విరివిగా రుణాలు అందించడం సమావేశాలు నిర్వహించి సంఘాల పనితీరు, వాయిదాల ప్రకారం కంతులు చెల్లించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు, వీఓ లీడర్లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా ముత్యాలప్ప

స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా ముత్యాలప్ప బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏపీఎం తిప్పన్న గుడిబండ మండలానికి బదిలీ అయ్యారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

సోమందేపల్లి : ఫ్యాక్టరీ, షాపుల్లో బాలలను పనిలో పెట్టుకోవద్దని ఎస్ఐ రమేష్‌బాబు వ్యాపారులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరం

రొద్దం: స్థానిక బస్టాండ్ ఆవరణలోని పీర్ల చావిడిలో వైఎస్సార్‌సీపీ నేత ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి, హఫ్సా క్లినిక్ సహకారంతో ఐకేర్ కంటి పరీక్షా కేంద్రం(పెనుకొండ) వారు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమై వారికి తక్కువ ధరలకే కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఐకేర్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

పరిగి: బీచిగానిపల్లిలో రైతు తిప్పారెడ్డికి చెందిన వ్యవసాయ మొక్కజొన్న పొలంలో శనివారం శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఏఓ విజయభారతి, ఏఈఓ లలిత, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు నరేంద్ర, వీఎస్ఏ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామం నడి బొడ్డున బస్టాండ్ వద్ద చాలా కాలంగా నిర్వహిస్తున్న కవిత మద్యం దుకాణాన్ని తొలగించి వేరే చోటుకు బదిలీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం వైన్స్ దుకాణం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కుటుంబాలు ఉండే చోట మద్యం దుకాణం ఉండటంతో ఆ మార్గం లో మహిళలు, విద్యార్థులు రాక పోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మద్యం మత్తులో ఉన్న మందు బాబులను చూసి మహిళలు, బాలికల భయాందోళనలకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికే పలు సార్లు మద్యం దుకాణం తొలగింపునకు ఆందోళన చేపట్టినా మద్యం దుకాణం యజమాని తన పలుకుబడితో అక్కడే మద్యం దుకాణం సాగిస్తున్నాడని మండిపడ్డారు. ఇంతకు మునుపే అతను మద్యం దుకాణాన్ని 3 నెలల్లోగా తొలగిస్తామని లిఖిత పూర్వకంగా పత్రం లో రాసి ఇచ్చాడన్నారు. అయితే ఇంత వరకు తొలగించ లేదన్నారు.తొలగించకపోతే మహిళలే మద్యం దుకాణం వద్ద నిరవధిక ధర్నా చేపడతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ సభ్యుడు వెంకటనాయుడు, డిష్ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామరెడ్డి జయంతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం మాజీ పార్లమెంట్ సభ్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీరామరెడ్డి జయంతి నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి ఎస్.రఘువీరారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ డిపాట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేవ్ సెక్రటరీ సత్యవతి, తుమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణ్ హాజరవుతారన్నారు. తాలుకా స్థాయి క్రికెట్ పోటీలో గెలుపొందిన జట్లకు వారు బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు.

ముగ్గురు ఉద్యోగుల తొలగింపు

పావగడ: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీదేవి, అరుణ, రిషికాంత్‌ను సీఎంఎస్ కంపెనీ వారు ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు వారిని రెండు రోజుల క్రితం పిలిపించి విచారణ చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎంఎస్ కంపెనీ ఆధ్వర్యంలో నియమించిన ఆ ఉద్యోగులు దాదాపు 10 సంవత్సరాలుగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా సోలార్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సంబంధిత సోలార్ కంపెనీ అధికారులతో పెద్ద ఎత్తున అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది.ఈ సందర్భంలో వారి తతంగాన్ని సోలార్ కంపెనీ అధికారులు రహస్యంగా వీడియోలు తీసి.. ఆ వీడియోలను సంబంధిత సీఎంసీ కంపెనీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముగ్గురు ఉద్యోగులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టించినట్లు తెలుస్తోంది. ఈ ఆధారాలతో ఆ ముగ్గురిని విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు అధికారికంగా తెలిసింది.

అభివృద్ధి పనులకు భూమిపూజ



గుట్టహళ్ళి వద్ద అమృత్ పథకానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటేశ్ శనివారం భూమి పూజలు నిర్వహించారు. తొలుత గుట్టహళ్ళి, మెహర్ బాబా గుడి వద్ద రూ.32 కోట్లతో ఇంటింటికీ తాగు నీరు అందించే అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కన్మాన్ చెరువు వడ్డెర కాలనీ వద్ద రూ.42 లక్షలతో రెండు అంగనవాడీ భవన నిర్మాణాలకు భూమి పూజ చేపట్టారు. అదే విధంగా అటవీ శాఖ కార్యాలయంలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించే నూతన కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, కౌన్సిలర్లు రవి, వెంకటరమణప్ప, బాల సుబ్రహ్మణ్యం, గుట్టహళ్ళి అంజినప్ప తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశావర్కర్ మృతి

పరిగి: శాసనకోట ఆరోగ్య ఉప కేంద్రంలో పని చేస్తున్న ఆశావర్కర్ రామాంజినమ్మ అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందింది. పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నవీన, స్వరూపరెడ్డి, పీహెచ్ఎన్ వెంకమ్మ, సీహెచ్ఓ వన్నప్ప తదితరులు రామాంజినమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.